




## తల్లిదండ్రులు ఓటు వేస్తే పిల్లలకు అదనపు మార్కులు!

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విద్యార్థులు ఎగిరి గంతేసే వార్త ఇది! లోక్‌సభ ఎన్నికల్లో తల్లిదండ్రులు ఓటు వేస్తే, వారి పిల్లలకు పరీక్షల్లో అదనపు మార్కులు వేస్తామని కొన్ని కళాశాలలు ప్రకటించాయి. సెయింట్ జోసఫ్ కాలేజ్ విడుదల చేసిన ప్రకటనలో తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు వేసిన అనంతరం కళాశాలకు వచ్చి, వేలికిగల సిరా గుర్తును చూపిస్తే, ఆ విద్యార్థులకు పరీక్షల్లో అదనంగా 10 మార్కులను వేస్తామని తెలిపింది. క్రైస్ట్ చర్చ్ కాలేజీ అయితే ఏకంగా 20 మార్కులు వేస్తామని చెప్పింది.



### 48 గంటల్లో పోలింగ్ వెల్లడిపై సమాధానమివ్వండి

న్యూఢిల్లీ: ఎన్నికలు జరిగిన 48 గంటల్లోగా తుది పోలింగ్ శాతాన్ని వెల్లడించాలని దాఖలైన పిటిషన్‌పై వారం రోజుల్లోగా తమ సమాధానం ఇవ్వాలని సుప్రీం కోర్టు శుక్రవారం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఏడీఆర్ సంస్థ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ప్రతిస్పందనను తెలపడానికి ఈసీకి తగిన సమయం అవసరమని పేర్కొంటూ, కోర్టు ఈ కేసును మే 24కు వాయిదా వేసింది.

### మమతపై బీజేపీ అభ్యర్థి అనుచిత వ్యాఖ్యలు

ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ: బెంగాల్ సీఎం మమతపై హైకోర్టు మాజీ జడ్జి, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అభిజిత్ గంగోపాధ్యాయ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఈసీ శుక్రవారం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ ఎన్నికల్లో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి నోటీసులు అందుకున్న వారిలో గంగోపాధ్యాయ నాలుగో వారు. ఈ నెల 15న ఓ బహిరంగ సభలో గంగోపాధ్యాయ.. మమతపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఈసీకి టీఎంసీ ఫిర్యాదు చేసింది.

### మమతపై వ్యాఖ్యలు సిగ్గుచేటు: కేటీఆర్

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): బెంగాల్ సీఎం మమతపై గంగోపాధ్యాయ చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఖండించారు. 'దేశంలో ఏకైక మహిళా సీఎం గురించి జుగుప్సాకరమైన, అసహ్యకరమైన, ఆమోదయోగ్యం కానీ వ్యాఖ్యలు చేయడానికి నీకు సిగ్గు ఉందా?' అంటూ మండిపడ్డారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### మ్యారిటల్ రేప్‌పై మీ వైఖరేంటి?

కేంద్రం వివరణ కోరిన సుప్రీం


న్యూఢిల్లీ, మే 17: కొత్త నేర న్యాయ చట్టాల్లో మ్యారిటల్ రేప్‌కు (భార్యకు ఇష్టం లేని శృంగారం) మినహాయింపు ఇవ్వడంపై దాఖలైన పిటిషన్లపై తమ వైఖరేంటో తెలపాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని కోరింది. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 63(రేప్)లో మినహాయింపు 2 ప్రకారం.. '18 ఏండ్లు దాటిన భార్యతో భర్త జరిపే లైంగిక సంపర్కం, లైంగిక చర్యలు రేప్‌గా పరిగణించబడవు'.

### కాంగ్రెస్ గెలిస్తే రామాలయం పైకి బుల్డోజర్లు: మోదీ

లక్నో: కాంగ్రెస్-ఎస్పీలను ఎన్నుకొంటే రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బుల్డోజర్లను ఎక్కడ ప్రయోగించాలనే విషయంపై ఆ పార్టీలు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. బారాబంకిలో శుక్రవారం ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ ఎస్పీ-కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామ్‌లల్లాను తిరిగి టెంట్ కిందకు పంపుతారు' అని అన్నారు. ముంబైలోని జరిగిన ఓ సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను 'మావోయిస్టు' పత్రంగా అభివర్ణించారు. దేవాలయాల్లోని బంగారం, మహిళల మంగళసూత్రాలపై ఆ పార్టీ కన్నేసిందని ఆరోపించారు.

# బీజేపీకి 'హర్యానా' హైరానా

- గత ఎన్నికల్లో కమలం పార్టీకి 10కి 10 సీట్లు
- ఈసారి మాత్రం ప్రతికూల పరిస్థితులు
- బీజేపీ విజయావకాశాలను దెబ్బతీస్తున్న రైతుల ఆందోళన, రెజ్లర్ల పోరాటం, అగ్నిపథ్
- మెజారిటీ సీట్లపై కన్నేసిన ఇండియా కూటమి



చండీగఢ్, మే 17: హర్యానాలో లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు బీజేపీకి జై కొట్టారు. 2014లో రాష్ట్రంలోని 10 స్థానాల్లో బీజేపీ ఏడు గెలుచుకోగా, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డీ) రెండు స్థానాలను, కాంగ్రెస్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. 2019 ఎన్నికల్లో మాత్రం బీజేపీ 58 శాతం ఓట్లతో 10కి 10 స్థానాలను కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, ఆ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు వేగంగా మారాయి. ఆరు నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు 58 నుంచి 36 శాతానికి పడిపోయాయి. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికలను బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మరోవైపు పదేండ్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్న ప్రజా వ్యతిరేకతను సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ - ఆమ్ ఆద్మీ పార్టీ కూటమి ప్రయత్నిస్తున్నది.

**బీజేపీపై రైతన్నల ఆగ్రహం**

2019 లోక్‌సభ ఎన్నికల్లో హర్యానాలోని మొత్తం 10 సీట్లను బీజేపీ గెలుచుకోవడం ఒక ఎత్తయితే, ఒక్క రోహ్‌తక్ మినహా మిగతా తొమ్మిది స్థానాలను లక్షల మెజారిటీలతో ఆ పార్టీ కైవసం చేసుకోవడం మరో ఎత్తు. అయితే, ఆ వెంటనే పరిణామాలు మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడం, వారిపై కేంద్రం కఠినంగా వ్యవహరించడం, ఇప్పటికీ రైతుల డిమాండ్‌లను నెరవేర్చకపోవడం వంటి కారణాలతో బీజేపీపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. హర్యానాలో రైతులు ఎక్కువగా జాట్ సామాజకవర్గానికి చెందిన వారే. రాష్ట్రంలో వీరి జనాభా 26 శాతం వరకు ఉంది. ఐదు లోక్‌సభ నియోజకవర్గాల్లో జాట్‌లే గెలుపోటములను నిర్ణయిస్తారు. ఇక, బీజేపీలో తమకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిందనే భావన కూడా జాట్‌లలో ఉంది. జాట్‌ల వ్యతిరేకతను గుర్తించిన బీజేపీ.. కోల్పోయే ఓట్లను ఓబీసీలతో భర్తీ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. అయితే, ఈ మార్పు ఓబీసీలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది చూడాల్సి ఉంది.

**రెజ్లర్ల ఆందోళన.. అగ్నిపథ్‌పై వ్యతిరేకత**

రాష్ట్రంలో బీజేపీకి మరికొన్ని అంశాలు కూడా ప్రతికూలంగా మారాయి. ముఖ్యంగా బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో రెజ్లర్లు ఆందోళనకు దిగడం, వారి పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి, బ్రిజ్‌భూషణ్ కుమారుడికి టికెట్ ఇవ్వడం వంటి అంశాలు కూడా హర్యానా ప్రజల్లో బీజేపీ పట్ల అసంతృప్తికి ఒక కారణం. ఆందోళనకు దిగిన రెజ్లర్లు ఎక్కువగా హర్యానాకు చెందినవారే. ఇక, హర్యానా యువత ఎక్కువగా సైనిక బలగాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇప్పుడు కేంద్రం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం పట్ల యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇది కూడా రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా మారే అవకాశం ఉంది. వీటికి తోడు పదేండ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగానే ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది. ఇక, కాంగ్రెస్ నుంచి కొత్తగా చేరిన అశోక్ తన్వర్, నవీన్ జిందాల్‌కు టికెట్లు ఇవ్వడం పట్ల కొందరు బీజేపీ నేతల్లో అసంతృప్తి ఉంది. ఈ అన్ని అంశాలు లోక్‌సభ ఎన్నికలు బీజేపీ విజయావకాశాలను తగ్గించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**కాంగ్రెస్‌కు కలిసొస్తున్న అవకాశాలు**

బీజేపీకి ఉన్న ప్రతికూల అంశాలను సద్వినియోగం చేసుకొని హర్యానాలో పూర్వవైభవం సాధించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. జాట్లు, రైతులు, యువతను ఆకర్షించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఆమ్ ఆద్మీతో పొత్తు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది. హర్యానాకు ఇరువైపులా ఉన్న పంజాబ్, ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉండటంతో హర్యానాలోనూ ఆ పార్టీ ప్రభావం ఉంది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ తొమ్మిది స్థానాల్లో, ఆప్ ఒక స్థానంలో పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు ఇక్కడ భూపిందర్ సింగ్ హుడా, కుమారి శెల్జా, రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా వంటి కీలక నాయకులు ఉన్నారు. అయితే, హుడా నేతృత్వంలో ఒక వర్గం, సుర్జేవాలా, శెల్జా, కిరణ్ చౌదరితో కూడిన 'ఎస్సార్కే వర్గం' మధ్య విభేదాలు పార్టీకి మైనస్‌గా మారాయి. ఇక, జాట్‌ల ఓట్లు ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు పడితే ఆ పార్టీ గణనీయ ఫలితాలను సాధించే అవకాశం ఉంది.

### ఐఎన్‌ఎల్‌డీ, జేజేపీ ప్రభావమెంత?

అభయ్ సింగ్ చౌతాలా నాయకత్వంలోని ఐఎన్‌ఎల్‌డీ, దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ)లు ఈ ఎన్నికల్లో విడిగా పోటీ చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలకు రైతులు, జాట్లలో పట్టుంది. దుష్యంత్ చౌతాలాకు యువతలోనూ ఆదరణ ఉంది. దీంతో ఈ రెండు పార్టీలు సాధించే ఓట్లు బీజేపీని దెబ్బతీస్తాయా? కాంగ్రెస్ విజయావకాశాలను నీరుగారుస్తాయా? అనేది ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీలు జాట్ల ఓట్లను చీలిస్తే బీజేపీకి లాభం జరగొచ్చనే విశ్లేషణలు ఉన్నాయి. అయితే, కుటుంబ కలహాలతో ఐఎన్‌ఎల్‌డీ, ఎమ్మెల్యేల ఫిరాయింపులతో జేజేపీ బలహీనపడ్డాయి. ఈ పార్టీలు ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపిస్తాయనేది చూడాల్సి ఉంది. మొత్తంగా బీజేపీకి ఈసారి ఇండియా కూటమి నుంచి గట్టి పోటీనే ఎదురవుతున్నది. ముఖ్యంగా, రోహ్‌తక్, సోనేపట్, సిర్సా, హిసార్, కర్నాల్ స్థానాల్లో బీజేపీ - కాంగ్రెస్ మధ్య పోటీ తీవ్రంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఛాతి, కడుపుపై తన్నాడు

### బిభవ్‌పై పోలీసులకు స్వాతి మలివాల్ ఫిర్యాదు



తీజ్‌హజారీ కోర్టు నుంచి బయటకు వస్తున్న మలివాల్

న్యూఢిల్లీ, మే 17: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో తనపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులకు చేసిన ఫిర్యాదులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలివాల్ కీలక విషయాలను వెల్లడించారు. 'నేను ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళ్లినప్పుడు బిభవ్ కుమార్ నాపైకి ఒక్కసారిగా దూసుకొచ్చి ఏడెనిమిది సార్లు బలంగా కొట్టాడు. నన్ను లాగేయడంతో టేబుల్‌కు నా తల తగిలి కింద పడిపోయాను. కావాలని నా చొక్కా పైకి లాగాడు. నా చొక్కా గుండీలు ఊడిపోయాయి. నా కడుపు, పొత్తి కడుపు, ఛాతిపై తన్నాడు. నేను పీరియడ్‌లో ఉన్నానని, నొప్పి భరించలేకపోతున్నానని చెప్పినా వినకుండా దాడి చేశాడు.' అని స్వాతి ఫిర్యాదు చేశారు. మరోవైపు, సీఎం నివాసంలోకి అనధికారికంగా ప్రవేశించేందుకు మలివాల్ యత్నించారని, తనను దూషించారంటూ ఆమెపై బిభవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**సీసీటీవీ ఫుటేజ్ వైరల్**

కేజ్రీవాల్ నివాసంలో స్వాతి మలివాల్ సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన 52 సెకన్ల సీసీటీవీ ఫుటేజ్ వైరల్‌గా మారింది. ఈ వీడియోపై స్వాతి మలివాల్ స్పందించారు. ప్రతిసారిలాగే ఈసారి కూడా 'రాజకీయ హిట్‌మాన్' తనను తాను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆమె ఆరోపించారు. అయితే, ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనేది బయటపెట్టలేదు.

**బీజేపీ కుట్ర: ఆతిశీ**

వైరల్ అయిన వీడియో ద్వారా మలివాల్ అబద్ధం చెప్తున్నట్టు బహిర్గతమైందని ఆప్ నేత ఆతిశీ పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో తనను కొట్టారని మలివాల్ ఆరోపించారని, కానీ వీడియోలో ఇందుకు పూర్తి భిన్నంగా ఉందన్నారు. ఆమెనే సెక్యూరిటీ సిబ్బందిని బెదిరిస్తున్నట్టుగా వీడియోలో ఉందని, ఆమె చెప్తున్నట్టు బట్టలు కూడా చినిగిపోయిలేవని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం.. కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు బీజేపీ పన్నిన కుట్రగా స్పష్టమవుతున్నదని, ఇందులో మలివాల్ కీలక భాగస్వామి అని ఆమె పేర్కొన్నారు. ఆతిశీ ఆరోపణలను మలివాల్ ఖండించారు.

## నిందితుల జాబితాలో కేజ్రీవాల్, ఆప్

న్యూఢిల్లీ, మే 17: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ శుక్రవారం మరో అనుబంధ చార్జిషీట్‌ను స్థానిక ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆయన నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీని నిందితుల జాబితాలో చేర్చింది. ఒక సిట్టింగ్ సీఎం, ఒక రాజకీయ పార్టీ మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కోవడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికి 18 మందిని అరెస్టు చేసిన ఈ కేసులో ఇది ఎనిమిదో చార్జిషీట్.

**కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్**

తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ఈ సందర్భంగా ఢిల్లీ సీఎంకు సూచించింది. ఆప్ అధ్యక్షుడిగా ఆ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించుకొనేందుకు సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు ఈనెల 10న మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

### తాజ్‌ను మరిపించేలా..



ఆగ్రా అనగానే అందరికీ తాజ్‌మహల్ గుర్తొస్తుంది. కానీ, చాలామందికి తెలియని మరో అద్భుత నిర్మాణం తాజ్‌మహల్‌కు 12 కి.మీ. దూరంలోనే ఉంది. ఇదే స్వామి బాగ్. రాధా స్వామి ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ప్రారంభించిన శివ్ దయాల్ సింగ్ స్మృతిగా దీన్ని నిర్మించారు. నిర్మాణానికి దాదాపు 106 ఏండ్లు పట్టింది. 1904లో నిర్మాణ పనులు ప్రారంభమై కొన్ని రోజులకే ఆగిపోయాయి. 1922లో మళ్లీ ప్రారంభమై ఇప్పుడు నిర్మాణం పూర్తయ్యింది. రాజస్థాన్‌లోని మక్రానా నుంచి తెప్పించిన పాలరాయితో దీన్ని నిర్మించారు.

### 2050 నాటికి ఆయుర్దాయంలో పెరుగుదల

న్యూఢిల్లీ: 2022 నుంచి 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుషుల సగటు ఆయుర్దాయంలో పెరుగుదల కనిపించనుందని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ప్రపంచ అధ్యయనం పేర్కొంది. ఇది పురుషుల్లో 5 ఏండ్లు, మహిళల్లో 4 ఏండ్లుగా ఉండనుంది. ప్రస్తుతం ఆయుర్దాయం తక్కువగా ఉన్న దేశాల్లో ఈ మెరుగుదల కనిపించనుందని.. దాని ఫలితం ప్రపంచ సగటును ప్రభావితం చేస్తుందని తెలిపింది. గుండె జబ్బులు, కొవిడ్-19, మాతృత్వ మరణాలు, శిశు మరణాలు, పోషకాహార వ్యాధులు, అంటు వ్యాధుల నిరోధంలో ప్రజారోగ్య రక్షణ చర్యలు మెరుగవడం వల్ల ప్రజల ఆయుర్దాయం పెరగనుందని అధ్యయనం విశ్లేషించింది. ప్రపంచ వ్యాప్తంగా సగటు జీవిత కాలంలో అసమానతలు తగ్గడం కూడా ఆయుర్దాయం పెరగడానికి ఒక కారణమని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ ప్రొఫెసర్ క్రిస్ ముర్రే తెలిపారు.

## భారత విద్యార్థులకు బహిష్కరణ ముప్పు!

### కెనడా పాలసీ మార్పుతో వర్క్ పర్మిట్‌ల నిరాకరణ

ట్రూడో సర్కారు తీరుపై విద్యార్థుల నిరసన




న్యూఢిల్లీ: కెనడా ప్రభుత్వ విధానాలతో అక్కడి భారతీయ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రికి రాత్రే ఇమ్మిగ్రేషన్ పాలసీల్లో మార్పులు చేసి, వర్క్ పర్మిట్‌లను నిరాకరించడంతో వందల మంది విద్యార్థులు ఇప్పుడు ఆ దేశం నుంచి బహిష్కరణ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కెనడాలోని ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్ రీజియన్‌లో ఆందోళనకు దిగారు. తమను దేశంలో ఉండేందుకు అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా, వర్క్ పర్మిట్‌లు ఇవ్వడం లేదని, దీంతో కెనడా నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**యూకే గ్రాడ్యుయేట్ రూట్ వీసా నిబంధనలు కఠినతరం!**

గ్రాడ్యుయేట్ రూట్ వీసా నిబంధనలు కఠినతరం చేయడం ద్వారా విదేశీ విద్యార్థుల్లో ప్రతిభావంతులైన వారిని మాత్రమే బ్రిటన్‌లో ఉండనిచ్చేందుకు అవకాశం ఇవ్వాలని రిషి సునాక్ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. దీంతోపాటు విదేశీ విద్యార్థులను తప్పు దోవ పట్టించే సమాచారాన్ని అందించే రిక్రూట్‌మెంట్ ఏజెంట్లపై అణిచివేత చర్యలు చేపట్టాలని యోచిస్తున్నది. అయితే ఈ విషయాన్ని సునాక్ మంత్రులతో ఇంకా చర్చించలేదని ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక తెలిపింది.

### అమర్‌నాథ్ యాత్రకు 65 వేల మంది రిజిస్ట్రేషన్

జమ్ము: అమర్‌నాథ్ యాత్ర కోసం 65,000 మందికిపైగా భక్తులు నమోదు చేయించుకున్నారు. వచ్చే నెల 29 నుంచి ఈ యాత్ర ప్రారంభం కాబోతున్నది. ఈ యాత్ర కోసం రిజిస్ట్రేషన్లు ఏప్రిల్ 15న ప్రారంభమయ్యాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు శాఖల ద్వారా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ బ్యాంకు అధికారి ఒకరు శుక్రవారం మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న తమ బ్యాంకు శాఖల ద్వారా 65,000 మందికిపైగా భక్తులు అమర్‌నాథ్ యాత్ర కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. వీరిలో 70 శాతం మంది పురుషులని, 30 శాతం మంది మహిళలని చెప్పారు. జూన్ 29 నుంచి ఆగస్టు 19 వరకు 52 రోజులపాటు యాత్ర కొనసాగుతుంది.

### పర్యావరణవేత్తలకు బ్లూ రెసిడెన్సీ వీసా

10 ఏండ్ల కాలానికి జారీ చేయనున్న యూఏఈ

అబు ధాబి: పర్యావరణ పరిరక్షణకు అవిరళ కృషి చేసిన వ్యక్తులకు పదేండ్ల బ్లూ రెసిడెన్సీ వీసాను మంజూరు చేయనున్నట్లు యూఏఈ ప్రకటించింది. దుబాయ్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ ఈ నెల 15న ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించారు. 'మన ఆర్థిక వ్యవస్థ పర్యావరణ సమతుల్యతతో ముడిపడి ఉంది. ఈ విషయంలో మన పయనం స్పష్టంగా, స్థిరంగా ఉంది' అని ఆయన అన్నారు. సముద్ర జంతుజాలాలు, భూమిపై ఉండే జీవావరణ వ్యవస్థలు, వాయు నాణ్యత, సుస్థిత సాంకేతికత తదితర రంగాల్లో కృషి చేసిన వారికి ఈ వీసాలు మంజూరు చేస్తారు. వీటిని పొందడానికి అర్హత, ఆసక్తి ఉన్నవారు గుర్తింపు, పౌరసత్వం, కస్టమ్స్, పోర్ట్ సెక్యూరిటీ(ఐసీపీ) అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు.

### అమెరికాలో తుఫాన్ బీభత్సం


హ్యూస్టన్‌లో నలుగురి మృతి

హ్యూస్టన్, మే 17: అమెరికాలో నాలుగో అతి పెద్ద నగరమైన హ్యూస్టన్‌ను గురువారం పెను తుఫాన్ వణికించింది. ఈ తుఫాన్ తాకిడికి నలుగురు పౌరులు మరణించగా, 8 లక్షల గృహాలు, వాణిజ్య సంస్థలు అంధకారంలో చిక్కుకున్నాయి. వేలాది భవనాల కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పలు వీధులను వరద నీరు ముంచెత్తడంతో కార్లు, ఇతర వాహనాలు నీటిలో మునిగాయి. ముందు జాగ్రత్తగా పాఠశాలలన్నింటినీ మూసివేశారు. రెండు విమానాశ్రయాల్లోని విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### నిప్పుల కొలిమిలా వాయువ్య భారతం

ఢిల్లీలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ, మే 17: వాయువ్య భారతాన్ని వడగాడ్పులు హడలెత్తిస్తున్నాయి. నైరుతి ఢిల్లీలోని నజాఫ్‌గఢ్‌లో దేశంలోనే అత్యధికంగా 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాజస్థాన్‌లో 19 ప్రాంతాలు, హర్యానాలో 18, ఢిల్లీలో 8, పంజాబ్‌లో రెండు చోట్ల 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే ఐదు రోజుల్లో వాయువ్యంలో తీవ్రవడగాల్పులు వీచే ప్రమాదం ఉంది.



### వీడిన పిరమిడ్ల మిస్టరీ!

కైరో: ఈజిప్టు పిరమిడ్ల నిర్మాణం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. భూమిలో పూడుకుపోయిన 64కి.మీ. పొడవైన నైలునది పాయ 'అర్హామత్'ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పరిశోధకులు గుర్తించారు. వేల ఏండ్ల నుంచి ఎడారి కింద మరుగున పడిన ఈ పాయ 31 పిరమిడ్ల పక్క నుంచి ప్రవహిస్తున్నదని, పిరమిడ్ల నిర్మాణానికి ఉపయోగించిన భారీ బండరాళ్లను ఈ పాయ ద్వారానే రవాణా చేశారని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ అధ్యయనం తేల్చింది.

# మృత్యుంజయులమే!

- మెదడు పాడవ్వకుండా కాపాడే క్రయోజెనిక్ ఫ్రీజర్
- 'మేడీ' పేరిట రూపొందించిన చైనా వర్సిటీ శాస్త్రవేత్తలు
- మరణించిన వారికి ప్రాణం పోయాలన్న ఆశలకు ఊపిరి
- ఇప్పటికే బాడీ ఫ్రీజర్లకు ఆర్డర్ ఇచ్చిన ప్రపంచ కుబేరులు






(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): మరణించిన వారికి తిరిగి ప్రాణంపోయడానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు ఏండ్లుగా జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ఏదీ విజయవంతం కాలేదు. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి.. మరణించిన వ్యక్తి మెదడును కాపాడలేకపోవడమే. అయితే, చైనాలోని ఫుడాన్ వర్సిటీ పరిశోధకులు తాజాగా అభివృద్ధిచేసిన సరికొత్త క్రయోజెనిక్ ఫ్రీజర్ వ్యవస్థ.. మరణించిన వారికి ప్రాణం పోయాలన్న ఆశలకు కొత్త ఊపిరిని ఇస్తున్నది.

**ఏమిటీ వ్యవస్థ?**

అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద మెదడు కణజాలాన్ని గడ్డకట్టేలా చేసి, తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేలా చేయడానికి సాయపడే క్రయోజెనిక్ ఫ్రీజర్‌ను చైనాలోని ఫుడాన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి 'మేడీ'గా నామకరణం చేశారు. మేడీ ఫ్రీజర్ నుంచి తీసిన అనంతరం మెదడులోని నాడీవ్యవస్థ పాడవ్వకుండా ఉండటమే కాకుండా గతంలో పని చేసినట్టుగానే అన్ని విధులను నిర్వహిస్తున్నట్టు పరిశోధనలకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ చిచెంగ్ షో చెప్పారు.

**మెదడు ఎందుకంత ప్రత్యేకం?**

చనిపోయిన మనిషిలోని అన్ని అవయవాలను నిర్దిష్ట ఉష్ణోగ్రతలు ఉన్న క్రయోజెనిక్ ఫ్రీజర్లలో పెట్టి ఎన్నేండ్లయినా భద్రపరుచవచ్చు. అయితే, మెదడును అలా భద్రపర్చడం కుదరదు. దీనికి కారణం మెదడు కణజాలం 80 శాతం మేర నీరుతో నిండి ఉండటమే. ఒకవేళ, మెదడును సాధారణ బాడీ ఫ్రీజర్లలో పెట్టి భద్రపరిస్తే, మెదడు కణజాలంలోని నీరు గడ్డకట్టి నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఉష్ణోగ్రతను సాధారణ స్థితికి తీసుకొచ్చినప్పుడు మెదడు మునుపటి విధులను నిర్వర్తించలేదు. దీంతో ప్రత్యేకమైన క్రయోజెనిక్ ఫ్రీజర్ అవసరం ఏర్పడింది.

**మేడీలో ప్రత్యేక రసాయనాలు**

మేడీలో మెదడును భద్రపర్చేప్పుడు మిథైల్ సెల్యూలోజ్, ఇథైలిన్‌గ్లైకోల్, డీఎమ్ఎస్‌వో, వై27632 వంటి ప్రత్యేక రసాయనాలను తగుపాళ్లలో వినియోగించినట్టు ప్రొఫెసర్ చిచెంగ్ షో తెలిపారు. అందుకే మెదడు పాడవ్వలేదని పేర్కొన్నారు. కాగా, తాజా పరిశోధనతో మెదడును కూడా భద్రపరిచే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరణించిన మనిషికి పునఃప్రాణం పోసే క్రతువులో ఇదో కీలక మైలురాయిగా అభివర్ణిస్తున్నారు.



పీటర్

### బాడీ ఫ్రీజర్లకు డిమాండ్



స్టీవ్ ఓకీ

మరణించిన తర్వాత తమ శరీరాన్ని భద్రపర్చుకోవడానికి ప్రపంచ కుబేరులు ఆసక్తి కనబరుస్తున్నారు. చనిపోయిన మనిషికి ప్రాణం పోసే సాంకేతికత అభివృద్ధి జరిగితే తాము మళ్లీ బతుకవచ్చన్న ఆశే వారిని ఇలా చేస్తున్నది. ఈ జాబితాలో పీటర్ తేయెల్ వంటి కుబేరులు, స్టీవ్ ఓకీ వంటి సెలబ్రెటీలూ ఉన్నారు. ఇప్పటికే వీళ్లు బాడీ ఫ్రీజర్లకు ఆర్డరిచ్చారు కూడా. కాగా, జీవంలేని శరీరాన్ని ప్రత్యేక ఫ్రీజర్‌లో భద్రపర్చాలంటే కనీసం రూ. 24 లక్షల వరకూ ఖర్చుచేయాల్సిందే.